

కవలలు.. కనుల పంట

ప్రపంచ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కోదాడలో వీరు ఒకే వేదిక పైకి రానున్నారు.

- 10లో



శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని డీఈఓ అశోక్ అన్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
37°/19°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది

న్యూస్‌రీల్

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టిసారించాలి

సూర్యాపేట రూరల్ : రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీధర్, డీఏఓ రామారావు నాయక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బాలెంల రైతువేదికలో ఆయిల్ పామ్ పంటల సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఈ పంట ఒకసారి వేస్తే 25 నుంచి 30 ఏళ్ల వరకు ప్రతి నెలా దిగుబడి ఇస్తుందన్నారు. ఎకరానికి 57 మొక్కలు నాటుకోవాలని, నాటిన నాలుగు సంవత్సరాల నుంచి పంట దిగుబడి మొదలవుతుందన్నారు. అనంతరం ఆయిల్‌పామ్ పంటసాగు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్ నాయుడు, ఏఓ జానిమియా, ఉద్యానఅధికారి జగన్, ఏఈఓ ఆయేషా, నేతలు పులగం రాఘవరెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సోమప్ప ఆలయ ఆదాయం రూ.3.67లక్షలు



హుండీ లెక్కిస్తున్న అధికారులు, సభ్యులు

నేరేడుచర్ల : బురుగులతండా గ్రామ పంచాయతీ పరిధిలోని సోమప్ప దేవాలయ హుండీని మంగళవారం ఆలయ అధికారులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లెక్కించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి రూ.3,67,337 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి కొంకపాక మృత్యుంజయశాస్త్రి, చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు తెలిపారు. వీటిలో హుండీ ద్వారా రూ.1,32,552, లడ్డూ, పులిహోర ద్వారా రూ.75 వేలు, కొబ్బరి కాయల ద్వారా రూ.85 వేలు, దర్శనం టికెట్ల ద్వారా రూ.74,775 వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పరిశీలకుడు గణేష్, ఆలయ ధర్మకర్తలు పెండెం సైదులు, లక్ష్మీనారాయణ, వీరప్పన్, పూజారి ఇరువంటి శ్రీనివాసశాస్త్రి, కమిటీ సభ్యులు వెంకట్రావ్, చంద్రయ్య, సుదర్శన్, నాయకులు శ్రీనివాస్, వెంకటయ్య, లక్ష్మణ్, కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, రాంమ్మూర్తి, నాగు, అనిల్, రవి, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, విక్రమ్, సోములు, సీతయ్య ఉన్నారు.

ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నాయకుల దాడులు

భానుపురి (సూర్యాపేట) : పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకన్న యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశ్చిమ వరంగల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్ పై అధికార పార్టీ వారు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, పవన్‌కు ఏం జరిగినా అక్కడి ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ బాధ్యత వహించాలన్నారు. పవన్ పై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించాలి



కుంటపల్లి వద్ద ఆటోమెటిక్ స్టార్టర్ తొలగిస్తున్న విద్యుత్ అధికారులు

మద్దిరాల : విద్యుత్‌ను ఆదా చేయాలంటే వ్యవసాయ మోటార్లకు ఉన్న ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించాలని విద్యుత్ అధికారులు అన్నారు. మంగళవారం కుంటపల్లి వద్ద వ్యవసాయ మోటార్లకు ఉన్న ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మన్ ఎల్లయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్టు కెప్టెన్‌గా నాగేశ్వరరావు



నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రానికి చెందిన తెల్లబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు పల్లవు నాగేశ్వరరావు ఆలిండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ తెలంగాణ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యారు. డెహ్రాడూన్‌లో ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న జాతీయ సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీల్లో తెలంగాణ జట్టుకు సారథ్యం వహించనున్నారు. ఆయన ఎంపిక పట్ల నడిగూడెం వాసులతో పాటు, తెల్లబల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

శత విధాలా ప్రయత్నం

- వందశాతం లక్ష్యంగా ఇంటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి
- ఐదు మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది
- కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు.. టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు
- రూ.30.38కోట్లకు ఇప్పటి వరకు రూ.16.97కోట్లు వసూలు
- ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 37రోజుల గడువు



సూర్యాపేట : జిల్లాలోని మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునాటికి ఐదు మున్సిపాలిటీల్లో రూ.30.38 కోట్లు వసూళ్లే లక్ష్యంగా అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటి వరకు రూ.16.97 కోట్లు వసూలు చేశారు. 37 రోజుల్లో రూ. 13.41 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. పన్నుల వసూళ్లకు టాస్క్‌ఫోర్ బృందాలను నియమించడంతో పాటు మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

పట్టణాల్లో ప్రచారం

జిల్లాలో ఐదు మున్సిపాలిటీ ఉన్నాయి. వీటిలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ పాత మున్సిపాలిటీలు కాగా తిరుమలగిరి, నేరేడుచర్ల కొత్తగా ఏర్పాటయ్యాయి. వీటి పరిధిలో 66, 007 ఇళ్ల అసెస్‌మెంట్లు అయ్యాయి. వీటికి సంబంధించిన పన్నులు రూ.30.38కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 57 శాతం మాత్రమే వసూలు చేయగలిగారు. అత్యధికంగా నేరేడుచర్ల మున్సిపాలిటీలో 59.24శాతం, అత్యల్పంగా హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో 43.04శాతం వసూలు చేశారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి 37రోజులు ఉంది. నిర్ణీత గడువులోగా వందశాతం ఇంటి పన్ను వసూలుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇంటి పన్నులతో పాటు వాణిజ్య సముదాయాలు, సెమీ వాణిజ్య సముదాయాలకు పన్నులు చెల్లించాలని అధికారులు జీపుల్లో తిరుగుతూ మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. పన్నులు చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నారు. చివరి నెలలో మాత్రమే గతంలో ఎక్కువగా పన్నులు వసూలు చేశారు. అయితే ప్రస్తుతం గతానికి కంటే భిన్నంగా అక్టోబర్ నెల నుంచే అధికారులు పన్నుల్లపై దృష్టిపెట్టారు. ఆర్‌ఐ, బిల్ కలెక్టర్‌లు, జూనియర్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది , జవాన్లతో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి పన్నులు వసూలు చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేసి ఆదివారం, ఇతర పండుగల సెలవు రోజుల్లో కూడా పన్నులను వసూలు చేస్తున్నారు.

రెడ్ నోటీసులు జారీ..

పన్నుల బకాయిలు అధికంగా ఉన్న వారికి రెడ్ నోటీసులు అందజేస్తున్నారు. జప్తు చేసే అధికారం మున్సిపాలిటీకి ఉంటుంది. తమకు ఇంటి పన్ను అధికంగా వచ్చిందని కొందరు.. మున్సిపల్ రెవెన్యూ విభాగంలో ఫిర్యాదులు చేస్తున్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీల అభివృద్ధికి సహకరించాలి. పన్నులు చెల్లించకుంటే అదనపు రుసుముతో అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. సెలవు రోజుల్లో కూడా పన్నుల వసూళ్లకు మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పెదబల్లి రామానుజులరెడ్డి, కమిషనర్, సూర్యాపేట.

మున్సిపాలిటీ వారీగా పన్నుల వివరాలు..

మున్సిపాలిటీలు	అసెస్‌మెంట్లు	లక్ష్యం (రూ.లక్షల్లో..)	వసూలు	శాతం
సూర్యాపేట	33304	1854.09	1040	52.01
హుజూర్‌నగర్	7500	266.45	128.63	43.04
కోదాడ	16179	699.27	390.17	49.23
నేరేడుచర్ల	3676	108.53	58.96	59.24
తిరుమలగిరి	5348	109.67	80.23	51.21

పేటను సుందరంగా తీర్చిదిద్దుకుందాం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్లు, ఎస్పీ తదితరులు

- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో మినీట్యాంక్‌బండ్, శిల్పారామం ఏర్పాటు స్థలం సందర్శన
- అభివృద్ధి పనులపై క్యాంపు కార్యాలయంలో కలెక్టర్లు, ఎస్పీ, అధికారులతో సమీక్ష

సూర్యాపేట: రెండు ట్యాంక్ బండ్‌లు, శిల్పారామం ఏర్పాటు, రోడ్ల విస్తరణ, జిల్లా కార్యాలయాలకు పక్కా భవనాలు, మెడికల్ కళాశాల, పార్కులు, జంక్షన్లతో సూర్యాపేట పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుకుందామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేట పట్టణంలో సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్, శ్మశాన వాటిక పనులతో పాటు నూతనంగా ఏర్పాటు చేయనున్న శిల్పారామం, అభివృద్ధి పనులను మంత్రి మంగళవారం సూర్యాపేట, నల్లగొండ జిల్లా కలెక్టర్లు వెంకట్రావు, వినయ్‌కృష్ణారెడ్డి, ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్‌లతో కలిసి సందర్శించారు. అనంతరం వారితో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధితో పాటు పాలనను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ సూర్యాపేటను జిల్లాగా ఏర్పాటు చేశారని ఈనేపథ్యంలో జిల్లా కేంద్రాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నామన్నారు. అందులో భాగంగా కోట్లాది రూపాయలతో అన్నిరంగాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడేది లేదన్నారు. పేటలో నూతన జిల్లా కార్యాలయాలు, మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ మోడ్రన్ మార్కెట్, గిరిజన గురుకుల పాఠశాల ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే రోడ్ల విస్తరణ, అన్ని సౌకర్యాలతో పాటు జంక్షన్లు, పార్కుల సుందరీకరణతో ఎవరూ ఊహించని అభివృద్ధితో పేట రూపు రేఖలు మారిపోతాయన్నారు. పేటలో ట్యాంక్‌బండ్‌లు, శిల్పారామం ప్రత్యేక ఆకర్షణలుగా నిలువనున్నాయన్నారు. అలాగే హైదరాబాద్‌ను తలపించేలా సద్దుల చెరువు మినీట్యాంక్ బండ్‌లో బోటింగ్ ఏర్పాటు చేసుకొని మరింత ఆహ్లాదాన్ని పొందుదామన్నారు. అన్ని హంగులతో కూడిన శిల్పారామంను మరింత సుందరంగా మార్చుకుందామన్నారు. అందుకు అవసరమైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌతం ప్రసాద్

- జిల్లా జడ్జి గౌతం ప్రసాద్

చివ్వెంల(సూర్యాపేట) : ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.గౌతం ప్రసాద్ కోరారు. మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కంటి చూపు సమస్య ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న కళ్ల అద్దాలను సద్వినియోగం సుకోవాలన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కోటాచలం, లీగల్ సెల్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి సీనపల్లి సోమేశ్వర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, వైద్య సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా జడ్జి గౌతం ప్రసాద్

● నృసింహుడి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



ప్రధానాలయం ముఖమండపంలో శ్రీలక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పూజలు చేస్తున్న అర్చకులు

- వివరాలు 8లో▸

కిట్లు రావట్లే.. నగదు అందట్లే !

- కేజీబీవీ విద్యార్థినులకు చెల్లించని కాస్మొటిక్ చార్జీలు
- కరోనా తర్వాత అతీగతి లేని కిట్లు
- బ్యాంక్ ఖాతాలు తెరిచినా జమకాని నగదు
- ఎనిమిది నెలలుగా తప్పని ఎదురుచూపులు
- జిల్లాలో 18 స్కూళ్లు.. 3,341మంది బాలికలు



అర్వపల్లిలోని కస్తూరిబా గాంధీ విద్యాలయం

నాగారం: కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలల్లో సౌందర్య పోషకాల (కాస్మొటిక్)కు సంబంధించిన డబ్బులు నిలిచిపోయాయి. కాస్మొటిక్ కిట్లకు బదులుగా డబ్బులు ఇస్తామన్న ప్రభుత్వం అవీ కూడా ఇవ్వడం లేదు. కరోనా తర్వాత ఈ పరిస్థితి నెలకొనడంతో విద్యార్థినులు సొంతగా కొనుగోలు చేసుకుంటున్నారు.

ఇబ్బందుల్లో పేద పిల్లలు..

కేజీబీవీల్లో ఎక్కువ పేద, మధ్య తరగతికి చెందిన కుటుంబాల పిల్లలే చదువుతుండడంతో వారిపై నెల నెలా ఆర్థిక భారం పడుతోంది. ఈ విద్యాలయాల్లో తల్లిదండ్రులు లేని పిల్లలు కూడా చదువుకుంటుండడంతో అలాంటి వారి కోసం సబ్బులు, పౌడర్, బొట్టుబిళ్లలు, దువ్వెన, నూనె వంటి వస్తువులతో కొంతకాలంగా ప్రభుత్వం కిట్లు పంపిణీ చేసింది. అయితే కరోనా తర్వాత కిట్ల పంపిణీ నిలిచిపోయింది.

ఒక్కొక్కటిగా అప్‌గ్రేడ్ అవుతూ..

నిరుపేద కుటుంబాలు, డ్రాపౌట్లుగా మారిన బాలికలకు వసతితో కూడిన విద్యనందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో కస్తూరిబాగాంధీ విద్యాలయాలు ఏర్పాటు చేశాయి. మొదట పదో తరగతి వరకు ఉన్న పాఠశాలల్లో క్రమంగా ఇంటర్ విద్యను ప్రవేశపెట్టారు. జిల్లాలోని 23 మండలాల్లో 18 కేజీబీవీలు ఉన్నాయి. వాటిలో నాలుగు పాఠశాలలు ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. అయితే పాఠశాలలు, ఇంటర్ విభాగాల్లో కలిపి మొత్తం 3,341 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాస్మొటిక్స్ కోసం ప్రభుత్వం 2018–19 నుంచి ప్రత్యేక కిట్ల రూపంలో పంపిణీ మొదలు పెట్టింది. సుమారు రెండేళ్లు కొనసాగిన ఈ విధానం.. కరోనాతో పాఠశాలల నిర్వహణ గాడి తప్పింది. కిట్ల పంపిణీని ప్రభుత్వం నిలిపి వేసింది.

ఖాతాలు సేకరించినా..

కాస్మొటిక్స్ కిట్ల పంపిణీ నిలిచిపోవడంతో నెలకు రూ.100 చొప్పున 10 నెలలు రూ.1000 అదిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో విద్యాశాఖ అధికారులు విద్యార్థుల వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలను సేకరించి ఉన్నతాధికారులు అందజేశారు. విద్యాలయాలు తెరిచి సుమారు ఎనిమిది నెలలు గడిచింది. ఇప్పటి వరకు అటు కిట్ల...ఇటు నగదు రాకపోవడంతో విద్యార్థులు నిరాశకు గురవుతున్నారు.

మేమే కొని తెచ్చుకుంటున్నాం



రెండేళ్లుగా కాస్మొటిక్స్ చార్జీలు రాకపోవడంతో మేమే నెలనెలా రూ.150 నుంచి రూ.200 పెట్టి సబ్బులు, పౌడర్, నూనె కొని తెచ్చుకుంటున్నాం. దీంతో కూలీ పని చేసుకుంటూ జీవనం గడిపే మా తల్లిదండ్రులకు ప్రతినెలా భారం పడుతుంది.

– కళ్యాణి, కేజీబీవీ విద్యార్థిని, తుంగతుర్తి

త్వరలో ఖాతాల్లో జమ



కాస్మొటిక్స్ కిట్ల స్థానంలో నగదు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. విద్యాశాఖ ఆదేశాలతో విద్యార్థుల పేరిట బ్యాంకు ఖాతాలు తెరిపించి వివరాలను పంపించాం. కాస్మొటిక్స్ చార్జీలకు సంబంధించి నిధులు విడుదలకు ఇటీవలే అప్రూవల్ వచ్చింది. త్వరలోనే విద్యార్థుల ఖాతాల్లో నగదు జమ కానుంది.

– శ్రావణ్‌కుమార్, ఇన్‌చార్జ్ జీసీడీఓ, సూర్యాపేట

ఉచిత ఆరోగ్య బీమా చేయించుకోవాలి

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద ప్రజల కోసం అమలు చేస్తున్న ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్, ఆయుష్మాన్ భారత్ –ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కార్యక్రమంలో ప్రతిఒక్కరూ నమోదు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం, బీఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు, 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఉచిత కేవీస్ వై ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సూర్యాపేట ఆరోగ్య జిల్లాగా మారిందన్నారు. ఆరోగ్య శ్రీ కార్డు పొందిన వారికి ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆస్పత్రుల్లో సంవత్సరానికి రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నూకల వెంకట రెడ్డి, సయ్యద్ సలీం, అడ్వకేట్ గుడిపూడి వెంకటేశ్వర రావు, సూదిని చంద్రశేఖర్ రెడ్డి, లయన్స్ క్లబ్ కోశాధికారి రాచకొండ శ్రీనివాస్, తెరటపల్లి సతీష్, బజ్జూరి శ్రీనివాస్, బెజగం ఫణి, వుల్లి రామాచారి, ఇస్మాయిల్, ఆరోగ్యమిత్ర రమణ, డేటా ఎంట్రీ ఆపరేటర్లు జగదీష్, సీఎస్‌సీ భూతరాజు మధు, ప్రతాప్, కుక్కడపు సాలయ్య, భిక్షం, సందీప్, కళ్యాణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ నమోదును ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ

పశువుల సంత.. నిర్వహణ చింత!

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కోదాడ సంత
- చీకటి పడితే మందుబాబుల వీరంగం
- అక్రమంగా పశువుల రవాణా
- పట్టించుకోని మార్కెట్ అధికారులు



కోదాడ పశువుల సంత

కోదాడ: ఒకప్పుడు రాష్ట్రంలోనే అతిపెద్దదిగా పేరున్న కోదాడ పశువుల సంత నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పట్టించుకోవాల్సిన వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు అది తమ పని కాదన్నట్టు వ్యవహరిస్తున్నారు. దీనికితోడు గస్తీకి వెళుతున్న కొందరు అక్కడి వారితో దోస్తీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సంతలో చీకటి పడిందంటే మందుబాబుల వీరంగంతో పాటు ఇతరత్రా కార్యకలాపాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు.

చీకటి పడితే చిందులే..

కోదాడ వ్యవసాయ మార్కెట్‌కు దాదాపు 25 ఎకరాలకు పైగా స్థలం ఉంది. దీనిలోనే సంతను నిర్వహిస్తారు. ఇది పట్టణం మధ్యలో ఉండడంతో పాటు దీనికి ఆనుకొని మద్యం దుకాణం ఉండడంతో పలువురు సంతను మద్యం సేవించడానికి వేదికగా వాడుకుంటున్నారు. సంతకు రెండు గేట్లు ఉన్నప్పటికి వాటిలో ఒకటి ఎప్పుడూ తీసే ఉంచడంతో పాటు చుట్టూ ఉన్న ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండడంతో గోడ దూకి లోనికి సులువుగా వస్తున్నారు. ఇక.. రాత్రి సమయంలో మద్యం సేవించి ఖాళీ సీసాలను అక్కడే పగలగొడుతుండంతో పశువుల కాళ్లకు గుచ్చుకుంటున్నాయని రైతులు వాపోతున్నారు. కొందరు పశువులను విక్రయించేవారు సంతలోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని కార్యకలాపాలు సాగిస్తున్నా ఎవరికీ పట్టడం లేదు.

కాపలా కాయలేని పరిస్థితి

కోదాడ పశువుల సంతంతో దాదాపు ఏడు కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేస్తున్నారు. గత సంవత్సరం పనులు ప్రారంభమైనా ఇంకా బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ పనులు ఆపి వేశాడు. ఇక్కడే విలువైన ఇనుము ఉంచాడు. అయితే మందుబాబులు రాత్రి సమయంలో అక్కడే మద్యం సేవించి ఐరన్ ఎత్తుకొని పోతుండడంతో వాచ్‌మెన్‌ను పెట్టుకొన్నాడు. దీంతో వాచ్‌మెన్ కాపలా కాయలేని పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఏం జరగనుందోనని హడలిపోతున్నాడు.

ఇరుకు వాహనాల్లో కుక్కి..

కోదాడ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ధాన్యం కొనుగోళ్లు ఏనాడూ జరగవు. కేవలం ఇక్కడ ప్రతి ఆదివారం పశువుల సంత మాత్రమే కొనసాగుతుంది. కొంతకాలంగా ఇక్కడకు పశువుల రాక బాగా తగ్గిపోయింది. శనివారం వట్టిపోయిన పశువులను విక్రయిస్తుంటారు. సాధారణంగా పశువులను రవాణా చేయడానికి అనేక నిబంధనలున్నా ఇక్కడ మాత్రం పట్టించుకునే వారు కరువయ్యారు. ఆరోగ్యంగా ఉన్న పశువులను సైతం వట్టిపోయిన వాటిగా చూపి ఇరుకు వాహనాల్లో కుక్కి రవాణా చేస్తుంటారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులకూ వెనుకాడని పరిస్థితి. ఆదివారం విక్రయానికి వచ్చే వారినుంచి, పశువుల అక్రమ రవాణా అడ్డుకోకుండా ఉండడానికి కొందరిని నియమించుకొని డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీరే పశువుల సంతలో కింగ్‌మేకర్లుగా వ్యవహరిస్తున్నారని సమాచారం.

అన్నీ ఉన్నా..

కోదాడ వ్యవసాయ మార్కెట్‌కు సంవత్సరానకి రూ.7 నుంచి రూ.8 కోట్ల వరకు మార్కెట్ సెస్ రూపంలో ఆదాయం వస్తుంది. ప్రతి ఆదివారం జరిగే పశువులు, గొర్రెల, మేకల అమ్మకాలపై కూడా ఆదాయం వస్తుంది. ఇటీవలే మార్కుట్ పాలకవర్గం పదవీకాలం తీరిపోవడంతో ప్రస్తుతం దీని నిర్వహణ బాధ్యతలను అధికారులే చూస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు జరగకపోవడంతో అధికారులకు దమ్మిడి పని లేదని, వారు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు పోతున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. దీంతో మార్కెట్ కార్యకలాపాలు అస్తవ్యస్తంగా తయ్యారయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం

పశువుల సంత విషయమై మా దృష్టికి ఎవరూ తీసుకురాలేదు. వెంటనే అక్కడ గస్తీ పెంచుతాం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవ్వరినీ ఉపేక్షించేది లేదు.

– శివశంకర్, కోదాడ పట్టణ సీఐ

క్లుప్తంగా

23న ఎంజీయూలో జాబ్‌మేళా

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ)లో 23వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి ఆపై చదివిన వారు, 2022 విద్యా సంవత్సరంలో పాస్ అవుట్ అయిన వారు కూడా ఉద్యోగ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి రాత పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

భువనగిరిటౌన్ : కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర పెట్రోల్, డీజిల్ ధరలను రోజు రోజుకూ పెంచుతూ ప్రజలపై భారాన్ని మోపుతుందని విమర్శించారు. సమావేశంలో నర్సింహ, బాలరాజు, మల్లేశం, పెంటయ్య, స్వామి, కృష్ణ, వెంకటేష్, జహంగీర్, ముత్యాలు, అనిల్, మధు, యాదయ్య, వెంకటేష్ ఉన్నారు.

నృసింహుడి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

- ఆరేళ్ల తర్వాత ప్రధానాలయంలో ఉత్సవాలు
- విశ్వక్సేనారాధన, స్వస్తి వాచనం, పూజలు చేసిన ఆచార్యులు
- నేడు అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, భేరి పూజ, దేవతాహ్వానం



అంకురార్పణ సామగ్రితో స్వయంభూ వద్ద పూజలు చేసేందుకు వెళ్తున్న అర్చకులు,అధికారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం మంగళవారం ప్రధానాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం 10గంటలకు ప్రధాన ఆలయంలోని స్వయంభూలకు పూజలు నిర్వహించారు. అనంతరం విష్వక్సేనారాధన, స్వస్తి వాచనం, రక్షాబంధనం, అంకురారోపణం వంటి పూజలు జరిపించారు. తొలి పూజలో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు. వారి వెంట ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు, యజ్ఞాచార్యులు, అర్చక బృందం, పారాయణీకులు ఉన్నారు.

ఉదయం విశ్వక్సేనారాధనతో..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 10గంటలకు గర్భాలయంలోకి స్వయంభూలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో ఉత్సవ మూర్తుల చెంత విశ్వక్సేనారాధతో ఉత్సవాలను ఆచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు.



స్వామి అమ్మవార్ల విగ్రహాలకు సంప్రోక్షణ చేస్తున్న ప్రధాన అర్చకులు

స్వస్తి వాచనం..

వార్షిక బ్రహ్మోత్సవములు నిర్వహించే సమయంలో ఆగమ శాస్త్రానుసారం స్వస్తి వాచనంతో వైదిక కార్యక్రమాలు ప్రారంభించడం ఆనవాయితీ. సస్తి వాచన మంత్ర జలాన్ని గర్భాలయంలో, ఉప ఆలయాల్లో, ముఖ మండపంలో, ధ్వజ స్తంభానికి, ఆలయ తిరుమాఢ వీధుల్లో, ఆలయ పరిసరాల్లో, భక్తులపై ప్రోక్షణ గావించారు.



ఈఓ గీతారెడ్డికి పట్టువస్త్రాలను అందజేస్తున్న పోచంపల్లి చేనేత కార్మికులు

రక్షాబంధనం..

విశ్వక్సేనారాధన, స్వస్తి వాచనం పూర్తయిన తర్వాత ఆచార్యులు రక్షాబంధనం పూజలు జరిపించారు. తొలుత గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా బంగారు కవచమూర్తులకు రక్షాబంధనం గావించారు. అనంతరం ఉప ఆలయాల్లోని ఆండాళ్ అమ్మవారికి, ఆళ్వారులకు, విశ్వక్సేనుడికి రక్షాబంధనం గావించి, ముఖ మండపంలోని ఉత్సవమూర్తులకు రక్షాబంధనం చేశారు. తర్వాత ఉత్సవ నిర్వాహకులు, భక్తులకు ఈ రక్షాబంధనం కట్టారు.

సాయంత్రం అంకురార్పణ..

సాయంత్రం నిత్యారాధనల అనంతరం మృత్సంగ్రహణం(పుట్ట మన్ను) సేకరించు వేడుకతో పాటు అంకురార్పణ వేడుకలను నిర్వహించారు. భూసూక్తముతో భూదేవిని అర్చించి మృత్తికను సేకరించి యాగశాలకు చేర్చారు. అనంతరం పుట్ట మన్నును మంత్ర జలములతో ప్రోక్షణ గావించి పాలికలో నవధాన్యాలు, పుట్ట మన్ను నింపి ఆరా ధాన గావించారు. ఈ వేడుకల్లో ఆలయ అధికారులు, ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్వామివారికి పోచంపల్లి పట్టువస్త్రాలు..

భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట: యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు బహూకరిస్తుంటారు. ఈ మేరకు మంగళవారం పోచంపల్లిలోని శ్రీమార్కండేశ్వర స్వామి దేవాలయంలో పట్టువస్త్రాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజనలు, కీర్తనలతో ప్రదర్శనగా యాదాద్రికి వెళ్లి ఈఓ గీతారెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తికి రెండు పట్టు చీరలు, పట్టు పంచెలు, రెండు శాలువాలను అందజేశారు. అదేవిధంగా మార్కండేశ్వరస్వామి దేవాలయం ఆధ్వర్యంలో ముత్యాల తలంబ్రాలను తీసుకెళ్లారు. కార్యక్రమంలో పోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, ఉపాధ్యక్షుడు అంకం మురళి, మార్కండేయస్వామి ఆలయ చైర్మన్ బడుగు చండీశ్వర్, నాయకులు తడక వెంకటేశం, తడక రమేశ్, భోగ నర్సింహ, బాలరత్నం, గంజి అంజయ్య, వనం మల్లేశ్, కర్నాటి అంజమ్మ, గుండు పాండు, కర్నాటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం భేరి పూజ, దేవతాహ్వానం, హవనం వంటి పూజలు జరిపిస్తారు.

యాదాద్రీశుడికి బంగారు ఆభరణాలు బహూకరణ



ఆలయ ఈఓ గీతారెడ్డికి బంగారు ఆభరణాలు అందజేస్తున్న దాతలు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లకు మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లకు చెందిన సత్తూరు సుందరమ్మ కుటుంబ సభ్యులు రూ.22లక్షల విలువైన బంగారు ఆభరణాలను బహూకరించారు. ఆండాళ్ అమ్మవారికి రంగనాయక హారం, లక్ష్మీదేవికి దశావతార హారంతో పాటు స్వామి వారికి డైమండ్ పచ్చల హారాన్ని తయారు చేయించి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తిలకు అందజేశారు.



ప్రధానాలయంలో భక్తుల రద్దీ

విద్యార్థులకు గ్రామీణ కృషి అనుభవం అవసరం



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు, కేవీకే శాస్త్రవేత్తలు

సూర్యాపేట రూరల్ : గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా లయోలా కళాశాలకు చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ విధానాలు స్థితిగతులను తెలుసుకొని గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం ద్వారా అధ్యయనం చేసినట్లు కేవీకే శాస్త్రవేత్త ఆకుల నరేష్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కాసరబాద గ్రామ పంచాయతీ ఆవరణంలో నిర్వహించిన గ్రామీణ అవగాహన సదస్సులో పాల్గొని పరిశీలించారు. ఈ ప్రక్రియలో వ్యవసాయ విద్యార్థులు గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను గుర్తించి గ్రామ పటంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వెన్ డయాగ్రమ్ పైచార్ట్ చిత్రాల రూపంలో ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు రేణుకనరేష్, షేక్ సలీం, రైతులు వెంకన్న, శ్రవణ్, రాములు, సిద్ధు, కృష్ణ, మానస, వైష్ణవి, దేవి, రుషిత, శైలజ, దీవెన, లోకేష్ పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకే దేశ పర్యటన



స్వామీజీని సత్కరిస్తున్న చైర్మన్ రంగయ్య

కోదాడఅర్బన్ : హిందూ ధర్మ పరిరక్షణ కోసం, సనాతన హైందవ ధర్మ కోసం భారతదేశం అంతా పర్యటిస్తున్నట్లు స్వామి రాధామనోహర్ పేర్కొన్నారు. దేశ వ్యాప్త పర్యటనలో భాగంగా కోదాడలోని శ్రీ గంటి రఘునాథస్వామి దేవాలయానికి ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు వి.రాఘవాచార్యులు, ఆలయ చైర్మన్ గుడుగుంట్ల రంగయ్య, ఆలయ కమిటీ సభ్యులు ఎస్ఎస్‌రావు, విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి యాదా సురేష్ స్వాగతం పలికారు. అనంతరం స్వామిజీ ఆలయ పరిసరాలను పరిశీలించి శ్రీగంటి రఘునాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యధికులు భారతదేశంలో హిందువులుగా ఉన్నప్పటికి హిందువులలో అనైక్యతతో మత మార్పిడులు జరుగుతున్నాయని, అలాంటి వాటిని హిందువులందరూ ముక్తకంఠంతో ఎదర్కొవాలన్నారు. కాగా స్వామిజీని ఆలయ చైర్మన్ గుడుగుంట్ల రంగయ్య శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ సూర్యాపేట జిల్లా సంయోజక్ యాదా నవీన్, పలువురు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, పలు ధార్మిక సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహాశివరాత్రి జాతర

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం వివిధ రకాల పూజలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతం, స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, విశేష అలంకరణ, మహనివేదన, మంగళనీరాజనం , మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సైదిరెడ్డి దంపతులు, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని దేవాలయ కమిటీ చైర్మన్ వెంకటరెడ్డి, ఆలయ మేనేజర్ కొండారెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ ఆశీర్వచనాలు అందించి ఘనంగా సన్మానించారు.



శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

ఉత్కంఠ భరితంగా ఎద్దుల పందేలు..

మహాశివరాత్రి జాతర సందర్భంగా దేవాలయం వద్ద నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎద్దుల పందేలు ఉత్కంఠ భరితంగా సాగాయి. మంగళవారం సాగిన పందేలను చూడడానికి ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



బండను లాగుతున్న గిత్తలు

ఓజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం..

శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా వచ్చే భక్తులకు ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా అన్నదాన కార్యక్రమం మంగళవారం నాలుగో రోజు కొనసాగింది.

పాఠశాలను పరిశీలించిన రాష్ట్ర మానిటరింగ్ టీం



మోడల్‌స్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర మానిటరింగ్ సభ్యులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ఇస్తాలాపురం, ఏనుబాముల, ఆత్మకూరు మోడల్ స్కూల్‌లను రాష్ట్ర మానిటరింగ్ సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. తరగతులు జరుగుతున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మానిటరింగ్ టీం అబ్జర్వర్ ఆర్.మంగారెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్ జనార్దన్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు శ్రీదేవి, భాగ్యలక్ష్మి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

సూర్యాపేట టౌన్ : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జెడ్పీపాఠశాలలో ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకొని భావిశాస్త్రవేత్తలుగా తయారుకావాలని అన్నారు. ఫిబ్రవరి 28న అన్ని పాఠశాలలో సైన్స్ రంగ వల్లులు వేయాలని వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు స్థానిక జయ స్కూల్ యాజమాన్యం సౌజన్యంతో అందించిన మెమెంటోలు అందించారు. ఎఫ్‌పీటీఎస్‌టీ జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి రామలింగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి దేవరశెట్టి జనార్దన్, దేవరాజ్, బుక్ డిపో మేనేజర్ స్థానిక హెచ్ఎం గోలి పద్మ, టాలెంట్ టెస్ట్ కన్వీనర్ కందిబండ గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు అపహరణ

మద్దిరాల: గుర్తుతెలియని వ్యక్తులు మహిళకు మాయమాటలు చెప్పి పుస్తెలతాడు అపహరించిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండల కేంద్రానికి చెందిన యరుకలి రాధిక, సైదులు దంపతులు స్థానికంగా కిరాణ షాపు నడిపిస్తున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి గుర్తుతెలియని మహిళ, వ్యక్తి కిరాణ సామాను కోసం షాపు వద్దకు వస్తూ పక్కనే డ్రిల్లింగ్ పనులు చేస్తున్నామని వారితో పరిచయం పెంచుకున్నారు. మంగళవారం మరోసారి షాపు వద్దకు వచ్చిన సదరు మహిళ, వ్యక్తి యాదగిరిగుట్టలో డ్రిల్లింగ్ చేస్తుండగా తమకు బంగారం ముద్ద దొరికిందని, దానిని అమ్మి పెట్టాలని రాధిక, సైదులు దంపతులకు చెప్పారు. దీంతో సైదులు ఆ బంగారం ముద్దను చెక్ చేయిస్తానని స్థానిక జ్యూయలరీ షాపు వద్దకు తీసుకెళ్లాడు. అదే సమయంలో షాపు వద్ద ఉన్న రాధికతో ×మేము అంత బంగారం ముద్ద ఇచ్చాము కదా.. నీ భర్త వచ్చే వరకు గ్యారంటీ కొరకు నీ మెడలోని బంగారపు పుస్తెలతాడు ఇవ్వమని₹ నమ్మించి 4.5 తులాల పుస్తెలతాడును తీసుకుని పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింగ్ వెంకన్న తెలిపారు. గ్రామాలల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ సూచించారు.

భూములు అమ్మితేనే జీతాలు ఇచ్చే పరిస్థితి



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

ఆత్మకూరు (ఎస్) : మిగులు బడ్జెట్‌గా ఉన్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని భూములమ్మితేనే ఉద్యోగుల జీతాలు ఇచ్చే పరిస్థితికి సీఎం కేసీఆర్ దిగజార్చారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు విమర్శించారు. మంగళవారం మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లి, పాత సూర్యాపేట, కందగట్ల గ్రామంలో ప్రజాగోస – బీజేపీ భరోసా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామానికి కేంద్ర ప్రభుత్వం కన్నా కేసీఆర్ ప్రభుత్వం ఒక్క రూపాయి ఎక్కువ నిధులు ఇచ్చినట్లు నిరూపిస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఆంధ్రప్రదేశ్లో 20లక్షల ఇళ్లు నిర్మిస్తే కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని గొప్పలకు పోయి ఇంత వరకు ఎక్కడా ఇల్లు కట్టించిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పంది రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాటి కరుణాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సంధ్యాల సైదులు, పీఏసీఎస్ డైరెక్టర్ ఎండీ అస్లాం, మండల నాయకులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

దేవరకొండ: పట్టణ శివారులోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటాయని, బూడిద రంగు ప్యాంట్, నారింజ రంగు షర్ట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440795604 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీనివాస్ సూచించారు.

ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా

- క్లీనర్ మృతి, డ్రైవర్‌కు తీవ్రగాయాలు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడడంతో క్లీనర్ అక్కడిక్కడే మృతిచెందగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లాలోని నర్సాపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడిపల్లిగూడేనికి ధాన్యం లోడు వెళ్తున్న లారీ తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ కాలనీ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామానికి చెందిన లారీ క్లీనర్ శివ అక్కడికక్కడే మృతిచెందగా, కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన డ్రైవర్ జానీకి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని, క్షతగాత్రుడిని సూర్యాపేట జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కండక్టర్ శ్రీనివాస్‌కు ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు



శ్రీనివాస్‌కు అవార్డు ఇస్తున్న నిర్వాహకులు

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ బస్సు కండక్టర్ కర్ల శ్రీనివాస్ మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో హనుమకొండకు చెందిన విస్డం చారిటబుల్ ట్రస్ట్ వారిచే కళా, సాహిత్యరంగాలకు అందిస్తున్న సేవలకు గాను ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. కవితలు రాస్తూ, పాటలు పాడుతూ, జానపద సాహిత్యరంగంలో తాను చేస్తున్న కృషిని గుర్తించి అవార్డు అందజేసినట్లు తెలిపారు. కాగా శ్రీనివాస్‌ను పలువురు స్థానిక సీనియర్ కళాకారులు అభినందించారు.

పరారైన ఖైదీకి జైలు శిక్ష, జరిమానా

మిర్యాలగూడ టౌన్: పోలీసుల కళ్లుగప్పి పరారైన నిందితుడికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.7వేల జరిమానా విధిస్తూ మిర్యాలగూడ మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ నాగ సుమబాల సోమవారం తీర్పునిచ్చారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లాకు చెందిన అయితం రవిశంకర్‌ను 2022లో ఓ కేసు విషయమై పోలీసులు మిర్యాలగూడ కోర్టుకు తీసుకొచ్చారు. అదే సమయంలో పోలీసుల కళ్లుగప్పి అతడు పరారయ్యాడు. దీంతో వన్ టౌన్ సీఐ రాఘవేందర్ నిందితుడిని పట్టుకొని కేసు నమోదు చేశారు. వన్ టౌన్ ఎస్ఐ శ్రీనునాయక్ కోర్టులో చార్జిషీట్ వేయగా నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ జి. సుధాకర్ వాదనలు వినిపించగా, అతడికి కోర్టు కానిస్టేబుల్ పెద్ది రాజు సహకరించారు.

మహిళను వేధించిన కేసులో మూడు నెలల జైలు

మహిళను వేధించిన కేసులో నిందితుడికి మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.3500 జరిమానా విధిస్తూ మిర్యాలగూడ మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నాగ సుమబాల తీర్పునిచ్చారు. వివరాలు.. మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడకు చెందిన బొమ్మకంటి శివ 2017లో ఓ మహిళను వేధింపులకు గురిచేయడంతో బాధితురాలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన అప్పటి వన్ టౌన్ ఎస్ఐ రామాంజనేయులు కేసును దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీట్ వేశారు. ఈ కేసును పూర్తిస్థాయిలో విచారించగా నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడు నెలలు జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

లారీ కింద పడి వ్యక్తి దుర్మరణం

మిర్యాలగూడ అర్బన్: లారీ కింద పడి వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మిర్యాలగూడ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని చర్చి బజార్‌కు చెందిన విజయ్(35) పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా విజయ్ మద్యానికి బానిసై మారి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్ రోడ్డు దాటుతుండగా లారీ కింద పడి అక్కడిక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా విజయ్ లారీ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని లారీ డ్రైవర్ చెబుతుండగా.. రోడ్డు దాటుతున్న క్రమంలో లారీ కింద పడి మృతి చెందాడని మృతుడి అన్న రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.